# ఉగాది

ఉగాది లేదా సంవత్సరాది తెలుగు సంవత్సరానికి ఆది. బ్రహ్మ దేవుడు సృష్టి గావించు నప్పుడు ఈ రోజుననే కృతయుగము ఆరంభమైనది. అనంతరము త్రేతా, ద్వాపర మరియు కలి యుగములు ఈరోజుననే ప్రారంభమైనవని పలువురి నమ్మకము. ఆ "యుగాది" అన్న పదమే వాడుకలో "ఉగాది" గా మారెనని ప్రతీతి. ఉగాది ప్రతి సంవత్సరము చైత్రశుద్ధ పాడ్యమి రోజు వస్తుంది. షడ్రుతువులలో మొదటిది వసంతం. శిశిర ఋతువులో ఆకులు రాలి మోడువారిన చెట్లు చిగురించి, పచ్చని ప్రకృతి ఎన్నో క్రొత్త అందాలనిస్తుంది, అనుభూతులను తెస్తుంది. ఉగాది వస్తోంది అంటే పంచాంగ శ్రవణం, కవితా పఠనము, ఉగాది పచ్చడి గుర్తుకురావడం సహజం.

పంచాంగములనగా తిథి,వారము,నక్షత్రము,యోగము మరియు కరణము. భూభ్రమణము కారణము గా మనకు రాత్రింబవళ్ళు, భూపరిభ్రమణము కారణముగా ఋతువులు సంభవించుచున్నవి. చంద్రుడు భూమి చుట్టూ తిరుగుట వలన చంద్రకళలు ఏర్పడుతున్నవి. పాడ్యమి మొదలుకొని పౌర్ణమి వరకు(15 రోజులు) శుద్ధపక్షము లేదా శుక్లపక్షము గానూ, మరలా పాడ్యమి మొదలుకొని అమావాస్య వరకు (15 రోజులు) బహుళపక్షము లేదా కృష్ణపక్షము గాను పేర్కొంటారు. చంద్రుని వృద్ధిక్షయములు మానవుని బాల్యము, యవ్వనము, కౌమారము, వార్ధక్యములను గుర్తుచేస్తాయి. బాల్యము నుండి శక్తిని వృద్ధి చేస్తూ క్రమంగా పెరుగుతూ వార్ధక్య సమయానికి శక్తి క్షీణించడము చంద్రకళలను ప్రతిబింభిస్తుంది. ఇక ఆదివారము మొదలు శనివారము వరకు (7) వారములు. అశ్వని మొదలుగా రేవతి వరకు (27) నక్షత్రములు. దక్ష ప్రజాపతికి 27 మంది పుత్రికలు కాగా, వారిని చంద్రునికిచ్చి వివాహం చేసినట్టు చెబుతారు. వారి పేర్లు 27 నక్షత్రముల పేర్లు. మన మహర్షులు ప్రతి నక్షత్రమునకు 4 పాదములుగా విభజించి, మొత్తము 108 పాదములుగా నిర్ణయించిరి. ఒక రాశిని 9 పాదముల వంతున ఈ 108 పాదములను 12 రాశులుగా గణించిరి. అవి మేషరాశి ఆదిగా మీనరాశి వరకు 12 రాశులు.

చంద్రుడు భూమి చుట్టూ తిరుగుటవలన మనకి రోజుకో నక్షత్ర మండలములో కనబడుచున్నాడు. ఏ నక్షత్ర మండలములో కనిపించునో ఆ నక్షత్రము ఆ రోజు నక్షత్రముగా మన పంచాంగము తెలుపు చున్నది. పౌర్ణమి నాడు చంద్రుడు ఏ నక్షత్రమున నుండునో ఆ నక్షత్రము పేరును బట్టి ఆ నెల పేరును నిర్ణయించిరి. పౌర్ణమి రోజున చంద్రుడు చిత్త నక్షత్రమున నుండిన చైత్ర మాసముగను, విశాఖ నక్షత్రమున నుండిన వైశాఖ మాసముగను, జ్యేష్ఠ నక్షత్రమున నుండిన జ్యేష్ఠ మాసముగను, పూర్వాషాఢ లేదా ఉత్తరాషాఢ నక్షత్రమున నుండిన ఆషాఢ మాసముగను, శ్రవణ నక్షత్రమున నుండిన శ్రావణ మాసముగను, పూర్వాభాద్ర లేదా ఉత్తరాభాద్ర నందుడిన భాద్రపద మాసముగను, అశ్వని నక్షత్రమున నుండిన ఆశ్వీయుజ మాసముగను, కృత్తిక నక్షత్రమున నుండిన కార్తీక మాసముగను, పుష్యమీ నక్షత్రమున నుండిన పుష్య మాసముగను, మఖ నక్షత్రమున నుండిన మాఘ మాసముగను, ఉత్తరఫాల్గుణి నక్షత్రమున నుండిన ఫాల్గుణ మాసముగను పిలుస్తాము.

వృద్ధి, సిద్ధి, శుభము ఆదిగా గల 27 యోగములు, బవ, బాలవ ఆదిగా గల 11 కరణములు గలవు. ప్రయాణ సమయములలో శుభాశుభ యోగములు పరిశీలించుట అనాదిగా వస్తున్నది. శుభాశుభ శకునములు స్వప్నములు కరణములలో భాగములు. కావున పంచాంగము లోని ఈ 5 అంగాలను పరిగణించి చేసిన కార్యములు దిగ్విజయమగును. పంచాంగాల ఆధారముగా రానున్న కాలములలో గ్రహ స్థితిగతులు, పాడిపంటలు, వర్షాల తీరు, ఎండల తీవ్రత, గ్రహణాలు ఇత్యాది విషయాలను లెక్కలుగట్టి శుభాశుభ మిశ్రమమైన భవిశ్యత్తును వినిపించే కార్యమే పంచాంగ శ్రవణము.

వేపపువ్వు, కొత్త చింతపండు రసం, కొత్త బెల్లం, మామిడి ముక్కలు, చెరుకు మొదలైన వాటిని కలిపి తయారుచేసే షడ్రుచుల (తీపి, పులుపు, కారము, ఉప్పు, వగరు, చేదు) మేలు కలయికే ఉగాది పచ్చడి. జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను ఎదురించి నిలవాలని తెలియజెప్పేందుకా? అని అనిపిస్తుంది. ఆరు రుచులకు, ఆరు ఋతువులకు ఏదో సంబంధాన్ని తెలియ జేస్తున్నట్లు తియ్యని వసంతం, చిరమరలాడే ఎండలతో కారం వంటి గ్రీష్మం, పనులకు ఆటంకం కలిగిస్తూ వగరుగా ఉండే వర్ష ఋతువు, గజ గజ వణికిస్తూ చేదుగా ఉండే శిశిర ఋతువు దర్శనమిస్తాయి. ప్రకృతి రంగు రంగుల పూలతో, పచ్చని పైరులతో ఆహ్లాద భరితంగా ఉండి, చక్కని కవిత్వానికి స్ఫూర్తినిస్తుందనే వుద్దేశ్యముతోనే కాబోలు ఈ రోజున కవి సమ్మేళన ప్రక్రియ ప్రవేశ పెట్టారు. కొత్తగా పూత పూచిన వేపపువ్వు, మామిడి పిందెలతో కళ కళ లాడే మామిడి చెట్లు, కుహూ రాగాలతో అలరించే కోకిల గీతాలు ఇవి కవిత్వానికి చేయూతనిస్తాయి. కొత్త సంవత్సర సందర్భముగా చెడు పనులకు తిలోదకాలిస్తూ, మంచి పనులను ఆహ్వానిస్తూ ఎందరో ప్రతిన బూనుతారు. తెలుగు సంవత్సరాలు ప్రభవ మొదలుకొని అక్షయ వరకు 60 సంవత్సరాలు.

రానున్న పార్థివ సంవత్సరము ఎల్లరకూ విజయవంతమై, కోరిన కోర్కెలు తీర్చేదిగా వుండాలని ఆకాంక్షిస్తూ

పూర్ణమిదం పూర్ణమద:

పూర్ణాత్ పూర్ణముదచ్యతే

పూర్ణశ్చ్య పూర్ణమాదాయ

పూర్ణమేవా వశిష్యతే

ఓం శాంతి: శాంతి: శాంతి: